www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 25 డిసెంబర్ 2024

5

వైఎస్ఆర్

ముగిసిన గుడ్ గవర్నెన్స్ వీక్

ప్రజాశక్తి - కడప

సమర్థవంతమైన పాలన, సేవలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా గుడ్ గవర్నెన్స్ వీక్ 2024 విజయవంతంగా నిర్వహించామని డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ప్రశాసన్ గావోన్ కి ఓర్ ' అనే నినాదంతో గ్రామీణ ప్రజలకు సమర్థవంతమైన పరిపాలనను చేరువ చేయడం, అభివృద్ధిని గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా, పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం, భారత ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, ఈనెల 19 నుంచి 24 వరకు జిల్లాలో అన్ని మండలాలతో పాటు జిల్లా ప్రధాన కార్యాలయాల్లో గుడ్ గవర్నెన్స్ వీక్ 2024 విజయవంతంగా నిర్వహించామన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మేరకు జి జి డబ్ల్యు -2024 డిసెంబర్ 24న విజయవంతంగా ముగిసిందని ఆయన తెలిపారు.

గండికోట వెతలు తొలగేదెన్నడో!

- 20 ఏళ్లుగా చెల్లింపుల కోసం పడిగాపులు
- లోపభూయిష్ట ఎనకమిక్ సర్వే ఫలితమే
- 20 దఫాలుగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక దృష్టికి
- గ్రీవెన్‌సెల్, స్పందన, పరిష్కార వేదిక చుట్టూ ప్రదక్షిణలు

ఇతని పేరు టి.లక్ష్మీనారాయణ, ముద్దనూరు మండలం కొర్రపాడు గ్రామ నివాసి, 1910లో 768 నెంబర్ కలిగిన 3.40 ఎకరాలు రిజిస్ట్రేషన్ కలిగి ఉంది. ఇదేపొలం 1952లో మంగలి వీరన్నకు పిత్రార్జితంగా సంక్రమించింది. భూమిని రెవెన్యూ అధికారులు చుక్కల భూమిగానూ, డికెటి భూములుగానూ మార్పు చేయడంతోపాటు, 2012లో ఇతని పొలాన్ని 12 ఎకరాలు భూమి కలిగిన మరో ప్రభుత్వ ఉద్యోగి పేరుతో ఆన్‌లైన్ చేసి పరిహారం చెల్లింపుల విషయంలో చుక్కలు చూపుతున్నారు. గండికోట నిర్వాసిత గ్రామాల్లో నిర్వహించిన ఎకనమిక్ సర్వే లోపభూయిష్టం కారణంగా వందలాది మంది పరిహారానికి నోచని పరిస్థితి నెలకొంది. 2016 నుంచి 2024 వరకు ఎనిమిదేళ్ల వ్యవధిలో 20 దఫాలుగా గ్రీవెన్‌సెల్, స్పందన, ప్రజాసమస్యల పరిష్కారవేదిక చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పరిష్కారానికి నోచని ఇటువంటి గాధలు కొల్లలు..



ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లాలోని గండికోట నిర్వాసితుల గోడు ఎవరికీ పట్టడం లేదు. రాయలసీమలో 26.85 టిఎంసిల నిల్వ సామర్థ్యం గండికోట సొంతం. రిజర్వాయర్ నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన త్యాగధనులు నిర్వాసితులు. నిర్వాసితులను నిర్లక్ష్యం చేయడం పాలకులకు పరిపాటిగా మారింది. నిర్వాసిత గ్రామాల్లో ముద్దనూరు మండల పరిధిలోని కొర్రపాడు ఒకటి. కొండాపురం మండలానికి పలు గ్రామాలకు చెందిన నిర్వాసితుల వెతలు వర్ణనాతీతం. నిర్వాసితుల పరిహారం చెల్లింపు పూర్వాపరాల్లోకి వెళ్తే....జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం, ముద్దనూరు మండలాల పరిధిలోని 22 గ్రామాలు ముంపు గ్రామాల పరిధిలో 17,809 నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున రూ.1800 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంది. 2018 ఆగస్టులో టిడిపి సర్కారు 16,800 పిడిఎఫ్‌లకు రూ.6.75 లక్షల చొప్పున పరిహారం చెల్లింపులు చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన సర్కారు రూ.2.25 లక్షలు కలిపితే రూ.10 లక్షల చొప్పున రూ.1,346 కోట్లు పరిహారం చెల్లింపులతో సరిపెట్టడంతో సమస్య నెలకొంది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో వైఎస్ జగన్ తాము అధికారంలోకి వస్తే గండికోట నిర్వాసితులకు అదనంగా రూ.3.25 లక్షలను కలిపి రూ.10 లక్షల వరకు చెల్లింపులు చేస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. ఆయన ఇచ్చిన హామీ మేరకు గత ఐదేళ్లగా 999 పిడిఎఫ్‌లకు రూ.454 కోట్లు చెల్లింపుల దిశగా అడుగులు పడకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఎకనమిక్ సర్వేతోనే ఇక్కట్లు!

2005లో గండికోట నిర్వాసిత గ్రామాల్లో ఆర్థిక స్థితిగతులను అంచనా వేయడానికి ఉద్దేశించి ఇంటింటికీ వెళ్లి ఎకనమిక్ సర్వే చేపట్టారు. సర్వేలో పాల్గొన్న అధికారులు, రెవెన్యూ మయాజాలం, ఇతర పొరపాట్ల కారణంగా దశాబ్దాల తరబడి నిర్వాసితులు ఎదురు చూడాల్సి వస్తోందనే వాదన వినిపిస్తోంది. ఫలితంగా 999 పిడిఎఫ్‌లకు రూ.454 కోట్ల చెల్లింపులకు కోల్డ్‌స్టోరేజీ జాబితాలో చేరిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఫేజ్-1 కింద అప్పటి సిఎం హామీ కింద రూ.295 కోట్లు, మిస్సింగ్ పిడిఎఫ్‌లకు రూ.46 కోట్లు, ఫేజ్-2 కింద కొండాపురం గ్రామానికి రూ.53కోట్లు, ఫేజ్-3 కింద రూ.999 పిడిఎఫ్‌లకు రూ.56 కోట్లు చొప్పున రూ.454 కోట్లు చెల్లిం పులు చేయాల్సి ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా వై ఎస్ జగన్ గండికోట నిర్వాసితులకు రూ.6.75 లక్షలకు అదనంగా 3.25 లక్షల చెల్లిస్తామని హామీనిచ్చారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఇచ్చిన హామీని అరకొర చెల్లింపులు చేసి మిగిలిన నిర్వాసితులను విస్మరించడం ఆందోళన కలిగిస్తోంది.

20 ఏళ్లు...20 దఫాలు

గండికోటను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం సందర్శించిన సంగతి తెలిసిందే. నిర్వాసితుల సమస్యపై స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తాననే మొక్కుబడి హామీకి పరిమితం కావడం నిరాశను కలిగించింది. ఇప్పటికే 20 దఫాలుగా గ్రీవెన్ సెల్, స్పందన, ప్రజాసమస్యల పరిష్కార వేదిక చుట్టూ ప్రదక్షిణలు చేసి అలిసిన నిర్వాసితులకు ఉపశమనం కలిగించడం లేదని తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేపై నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

ప్రజా సమస్యలపై పోరాటాలు

- మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజలకిచ్చిన మాట మీద నిలబడి, ప్రజల కష్టాలను నా కష్టాలుగా భావించి, ప్రజలకు మంచి చేశామని మాజీ సిఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో కడప కార్పొరేటర్లు, ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలపై నిలదీయాలన్నారు కూటమి ప్రభుత్వం ప్రజల దగ్గరకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొ ందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా చిన్నపిల్లలతో సహ నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అని వారి తల్లులైతే నీకు రూ.18 వేలు, ఆ అమ్మలకు తల్లులు, అత్తలు కనిపిస్తే నీకు రూ.48 వేలు అని, 20 ఏళ్ల దాటిన పిల్లవాడు ఇంట్లో కనిపిస్తే రూ.36 వేలు అని, కండువా వేసుకుని ఇంట్లోంచి రైతు బయటకు వస్తే నీకు రూ.20 వేలని ఇంట్లో ఎవరినీ వదిలి పెట్టకుండా ఆశపెట్టారని పేర్కొన్నారు. వారంతా మా డబ్బులు ఏమయ్యాయని నిలదీస్తారని తెలి పారు. ఏ టిడిపి కార్యకర్త ఎవరి ఇంటికి వెళ్లే పరి స్థితి లేదన్నారు. జమిలి ఎన్నికలు 2027లో అంటు న్నారని నెలలు గడిచేకొద్దీ చంద్రబాబులో భయం పెరిగిపోతుందని చెప్పారు. మనం రెట్టిం చిన ఉత్సాహంతో ముందుకెళుతున్నామని చెప్పారు. మన ప్రభుత్వం మళ్ళీ రాగానే నాతో పాటు ఈ కష్టాల్లో ఉన్నవారికి మంచిరోజులు వస్తాయని తెలి పారు. ఇబ్బందులు కొంతకాలం ఉంటాయి, మనల్ని ప్రలోభాలకు గురిచేసినా కొంత ఓపిక పట్టాలని చెప్పారు. మీకు నా తమ్ముడు అవినాష్ అందు బాటులో ఉంటాడని మీకు ఏ అవసరం వచ్చినా తనను కలవండని చెప్పారు. తప్పకుండా సాయం చేస్తారు, నేను కడప బిడ్డను కాబట్టే మీరంటే నాకు ప్రత్యేకమైన అనుబంధం, మీరందరి ప్రేమ ఎప్పటికీ మరిచిపోనన్నారు. మనం ఇంత త్వరగా ప్రజల్లోకి వెళ్ళాల్సి వస్తుందనుకోలేదని చెప్పారు. చంద్రబాబు బాదుడే బాదుడులాగా పాలన సాగిస్తున్నారని, సూపర్ సిక్స్ లేదు సూపర్ సెవెన్ లేదు, అందుకే మనం పోరుబాట పట్టాల్సి వస్తుందని చెప్పారు. ఇప ్పటికే రైతు ధర్నా చేశామని ఈ నెల 27న కరెంట్ బిల్లులపై మరో నిరసన కార్యక్రమం, జనవరి 3న విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్‌పై వారి తరుపున మరో కార్యక్రమం చేయాల్సి వస్తుందని చెప్పారు. మీ అందరి సహాయ సహకారాలు కావాలి, మీ రం తా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానని చెప్పారు.

వైసిపి ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న జగన్

వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జగన్

ఇడుపులపాయలో క్రిస్మస్ ప్రార్థనలు

ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రాల్గొన్ని బంధువులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా జిల్లాలో నాలుగు రోజుల పర్యటన కోసం మంగళవారం బెంగుళూరు నుండి హెలికాప్టర్‌లో ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రానికి జగన్ విచ్చేశారు. తండ్రికి నివాళులర్పిం చిన అనంతరం ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న నెమళ్ల పార్కు సమీపంలోని ఓపెన్ చర్చిలో జరిగే క్రిస్మస్ వేడుకల్లో హాజరయ్యారు. ముందస్తు క్రిస్మస్ ప్రార్థనలను ఫాదర్ నరేష్ చేపట్టగా అ ప్రార్థనల్లో బంధువులతో కలిసి జగన్ పాల్గొన్నారు. ప్రార్థనలు అనంతరం తన తల్లి విజ యమ్మ, సతీమణి భారతితో పాటు బంధువులతో కలిసి విందు భోజనం చేశారు. బంధువులను, వైసిపి నాయకులను ఆప్యాయంగా పలకరించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విజ యమ్మకు జగన్ ఎదురు పడ డంతో ఆమె తన కొడు కును ఎంతో ప్రేమగా హక్కున చేర్చుకొని ఆశీర్వ దించారు. జగన్‌ను చూడ గానే ఒక్కసారిగా అక్కు ను చేర్చుకున్న విజయమ్మ ఆశీర్వాదం తెలియ జేయడమే కాకుండా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం కడప వైసిపి నాయకులతో సమావేశం అయ్యారు. ముందస్తు క్రిస్మస్ ప్రార్థనల్లో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, సుధీకర్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, రావఎచంద్రారెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, సతీష్ రెడ్డితో పాటు వైఎస్ఆర్ బంధువులు పాల్గొన్నారు.

జైళ్లను సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి - కడప/జమ్మలమడుగు రూరల్

సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మంగళవారం కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్ జైళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. అనంతరం జైలు పరిసరాలను, వంటగదులను, వసతి గదులను, టాయిలెట్లను, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగింది. రిజిస్టర్లను పరిశీలించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే కమలాపురం మండల న్యాయ సమితిని, జమ్మలమడుగు మండల న్యాయ సేవా సమితిని, ప్రొద్దుటూరు మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూర సబ్ జైలుల సూపర్డెంట్‌లు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, ఖైదీలు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న సివిల్ జడ్జి

'కేతు' పేరిట ప్రతిభావంతులకు బంగారు పతకం

ప్రోత్సాహకాల కోసం చెక్కును అందజేస్తున్న కేతు విశ్వనాథరెడ్డి సతీమణి

ప్రజాశక్తి - కడప అర్బన్

సుప్రసిద్ధ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పేరిట యోగి వేమన విశ్వవిద్యాలయంలో ప్రతిభావంతులకు బంగారు పతకాలు ఇవ్వనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు ప్రకటించారు. ' ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి స్మారక బంగారు పతకం' పేరిట పోస్ట్ గ్రాడ్యుయేషన్ తెలుగు శాఖలో ప్రతిభ చూపిన విద్యార్థికి బంగారు పతకం, నగదు బహుమతి ఇవ్వాలని ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి సతీమణి కేతు పద్మావతి, కుమారుడు కేతు శశికాంత్ , కుమార్తెలు కె. మాధవి, కె. శిరీష కోరారు. కడప నగరం సింగపూర్ టౌన్‌షిప్‌లోని కేతు విశ్వనాథరెడ్డి నివాసంలో యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డిని, తెలుగు శాఖ అధిపతి ఆచార్య ఎం.ఎం.వినోదినిని ఆహ్వానించి కాసేపు చర్చించారు. అనంతరం రూ. 2.50 లక్షల చెక్కును ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి సతీమణి కేతు పద్మావతి, కుమారుడు కేతు శశికాంత్ వైవీయూ విసికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేతు కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. తెలుగు భాషను సజీవంగా నిలపాలన్న తపన గల విశ్వనాథరెడ్డి చిరస్మరణీయులన్నారు. ఈ నిర్ణయం వల్ల వైవీయూలో తెలుగు శాఖ విద్యార్థులు పోటీతత్వంతో చదువులు సాగించి ప్రతిభావంతులుగా తయారవుతారని ఆకాంక్షించారు. ప్రతి కాన్వకేషన్‌లో ప్రతిభావంతులకు బంగారు పతకం తో పాటు, ప్రోత్సాహకంగా రూ.10 వేల నగదు బహుమతిని అందజేస్తామన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న విప్ మాధవి

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- కడప అర్బన్ : కడప నియోజకవర్గంలో 10 మంది లబ్ధిదారులకు రూ.6,60,513 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యలు త్వరగతిన పరిష్కరిస్తూ, సహాయ సహకారాలను అందిస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం సి ఎం సహాయ నిధిని పక్కనపెట్టి ప్రజలను ఏ రకంగా పీడించిందో మనందరం చూశామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం సహాయ నిధి ద్వారా బాధిత, నిరుపేద కుటుంబాలకు డబ్బులను అందజేసి వారికి ఆపదలో అండగా నిలుస్తుందని తెలిపారు.

వ్యాధులపై సమగ్ర సర్వే చేపట్టాలి

ప్రజాశక్తి-రాజంపేటఅర్బన్ : టిబి, కుష్టు వ్యాధులపై వైద్యాధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది ఇంటింటా సమగ్ర సర్వే నిర్వహించాలని అదనపు డిఎంహెచ్ఒ శైలజ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం రాజంపేట డివిజన్ పరిధిలోని ఆకేపాడు, నందలూరు, పెనగలూరు పిహెచ్‌సిలకు సంబంధించిన కమ్యూనిటీ హెల్త్ అధికారులకు ఈడిగపాలెం ఆరోగ్య కేంద్రంలో టిబి, కుష్టు వ్యాధులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది వ్యాధిగ్రస్తుల ఇళ్లకు సందర్శనకు వెళుతున్నారా, లేదా అని, వ్యాధిగ్రస్తుల ఇంటి కుటుంబ సభ్యులకు టిబి నియంత్రణ తెరఫీ ఇస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. ప్రధానమంత్రి టిబి ముక్త భారత్ పంచాయతీ రిపోర్టులను తనిఖీ చేశారు. కుష్టు వ్యాధి సర్వేపై తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శేఖర్, వైద్యులు డాక్టర్ అశ్విని చంద్ర, డాక్టర్ అశోక్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చెన్నారెడ్డి, సుబ్బు, యుడిసి సిద్ధరామయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రేమ, శాంతినే క్రిస్మస్ ప్రత్యేకత అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మాధవి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ హాల్‌లో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ సెమీ క్రిస్మస్ వేడుకలను ప్రభుత్వపరంగా నిర్వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. గత ప్రభుత్వంలో ఎప్పుడు కూడా పండుగలు చేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి భద్రత కల్పిస్తుందన్నారు. ఆర్థిక లోటును అధిగమించి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని చెప్పారు. తొలుత క్రిస్మస్ ట్రీకి లైట్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఇమ్రాన్, క్రైస్తవ మత పెద్దలు శామ్యూల్, విజయ భాస్కర్, ప్రభుదాస్, జాన్,మహేష్, టిడిపి ఎస్టి సెల్ నాయకులు రమేష్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోరుబాటను విజయవంతం చేయాలి : వైసిపి

ప్రజాశక్తి - కడప : విద్యుత్ ఛార్జీల బాదుడుపై ఈనెల 27న నిర్వహించనున్న పోరుబాట నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో పోరుబాట నిరసన కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, దాసరి శివ, షఫీ, కార్పొరేటర్లు మహమ్మద్ షఫీ కే.బాబు, శ్రీరంజన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

వ్యవసాయ అధికారిని కలిసిన నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- కడప అర్బన్

నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంఘం నాయకులు జిల్లా వ్యవసాయ అధికారి ఎ.నాగేశ్వరరావు మంగళవారం ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. సభ్యులంతా కలిసి వ్యవసాయ అధికారిని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహ అధ్యక్షులు (అసోసియేట్ ప్రెసిడెంట్) వి.రఘురామనాయుడు, కోశాధికారి దొగురు శ్రీహరి, జిల్లా అధ్యక్షులు యం.ఎ.ప్రసాద్ గౌడ్, కార్యదర్శి యస్.గిరిధర్, ట్రెజ రర్ యం.మహేశ్వర రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ యం.వి.భాగ్యప్రసాద్, వైస్ ప్రెసిడెంట్స్, టి. సుమార్జి, జి.శ్రీనివాసులు, సి.నాజీరా,కార్యనిర్వహక కార్యదర్శులు యస్.జిలానీ బాష, యస్.చంద్రకళావతి,ఉప కార్యదర్శులు, యస్.ఆనంద్, యస్.ఖాదర్ బాషా, కుమారి కె.గంగా దేవి, పి. భువ నేశ్వరి, ఈసీ మెంబర్ బి.ప్రత్యూష, విజయలక్ష్మి, రాష్ట్ర ఈసీ మెంబర్ యస్. హబీబ్ రహ్మాన్ పాల్గొన్నారు. వ్యవసాయ అధికారితో నూతన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రయోజనాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : మన మనస్సు ఆందోళన నుంచి విముక్తి పొందేలా ప్రశాంతత, శాంతి ధ్యానం వల్ల కలుగుతుందని దివ్య బాబాజీ సుషుమ్నా క్రియా యోగా ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ అల్లూరి ఉమాదేవి, ప్రతినిధి మాధురి లక్ష్మి అన్నారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుషుమ్నా క్రియ అనేది 4 రకాల ధ్యానాల కలయిక అని వివరించి అవగాహన కల్పించారు. ధ్యానం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. కళ్లు కాకుండా కనుబొమ్మల మధ్య దృష్టి కేంద్రీకరించాలని, శ్వాసపై దృష్టి నిలపాలని సూచించారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ మైథిలి మాట్లాడుతూ మానసిక పరిశుభ్రతకు ఇది ఒక ముఖ్యమైన పద్ధత న్నారు. ప్రశాంతతతో కూడిన మనస్సు, ఏకాగ్రత, అవగాహన స్పష్టత, సమాచార అభివృద్ధి, మానసిక నైపుణ్యాలు ధ్యానం వల్ల వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి డా.అనూ ప్రసన్న విద్యార్థులు, సిబ్బంది , వసతి గృహ కార్మికులు పాల్గొన్నారు.

వాహనాలకు రికార్డులు తప్పనిసరి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రతి ఒక్క వాహనదారులు రికార్డు కలిగి ఉండాలని వన్ టౌన్ సిఐ రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రాజీవ్ పార్క్ వద్ద వాహన తనిఖీ చేశారు. త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ రికార్డులను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలో పాటించాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కుర్చీ తగాదాలను ఆపాలి

ప్రజాశక్తి - కడప

కుర్చీ తగాదాలను ఆపి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీఖాన్, కడప అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త బండి జకరయ్య, గౌస్ పీర్, రహమతుల్లా ఖాన్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మేయర్, కడప ఎమ్మెల్యే తమ సమయాన్ని కూర్చి తగాదాలకు వృథా చేయడం సరికాదన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ బాడీ సమావేశంలో కార్పొరేటర్లు, ఎమ్మెల్యే మధ్య కుర్చీ కోసం జరిగిన వాడీవేడి వాదనలు సరైనవి కావని పేర్కొన్నారు. వారి తగాదాలను చూసి ప్రజలు అసహ్యం చుకుంటున్నారని అన్నారు. కుర్చీల కోసం కొట్లాడుకుంటూ సమయం వృథా చేయడమేగాక ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ కార్పొరేషన్ చట్టం సెక్షన్ 88 ప్రకారం మేయర్ సమావేశాలకు అధ్యక్షత వహించాల అన్నారు. మేయర్ కార్పొరేషన్ కార్యకలాపాలను సమన్వయపరుస్తూ, ఎమ్మెల్యే ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కార్పొరేషన్ ప్రణాళికలను అమలు చేయడంపై దృష్టి సారించాలి అన్నారు. వివాదాలు రావడం అనివార్యమైతే, సంబంధిత న్యాయస్థానాలను ఆశ్రయించాలే తప్ప ప్రజల సమయం, ధనాన్ని వృథా చేయకూడదని హితవు పలికారు. ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకూడదని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది అన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సిరాజుద్దీన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

సామాజిక సేవే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వ విద్యాలయం జాతీయ సేవ పథకం యూనిట్-9 ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైవీయూ వెస్ట్ క్యాంపస్ కంప్యూటర్ సైన్స్, కామర్స్, బిజినెస్ మేనేజిమెంట్ బిల్డింగ్స్ పరిసరాలలో ఉన్న ముళ్ళు చెట్లను, ప్లాస్టిక్స్ వేస్టేజి, కలుపు మొక్కలు తొలగించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంగా భాగంగ పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నామన్నారు. అందరం కలసి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కామర్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ బి.విజయభారతి, డాక్టర్ క్రిష్ణయ్య, నారాయణ రెడ్డి, డాక్టర్ రఫీ, డాక్టర్ రజిని పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

కాశీరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైసిపి సీనియర్ నాయకుడు కాశీరావు కుటుంబసభ్యులను మంగళవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి పరామర్శించారు. స్థానిక జెండామాను వీధిలో ఉన్న కాశీరావు ఈనెల 12న అనారోగ్యంతో మృతి చెందాడు. కాశీరావు కుమారులు సోమశేఖర రావు, ప్రియా ఐస్ క్రీమ్ పార్లర్ ప్రసాద్‌రావు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, గంగాధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, నాలుగో వార్డ్ కౌన్సిలర్ వానపల్లి కిషోర్, ఏడో వార్డ్ కౌన్సిలర్ ఖాదర్ బాషా, కోడి రమణ, శ్రీరాములు ఉన్నారు.

పంటకోత ప్రయోగాలు పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతులు సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ పర్యవేక్షణాధికారి వెంకట కృష్ణారెడ్డి సూచించారు. కొసినేపల్లె గ్రామంలో మంగళవారం ఆయన వరిలో పంటకోత ప్రయోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో రైతు గంగాప్రసాద్ 1.37 ఎకరాల విస్తీర్ణంలో 5ఐ5 మీటర్ల దూరంలో ప్రయోగం నిర్వహించగా 1.780 కిలోలు దిగుబడి వచ్చిందన్నారు. రైతులు సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయన్నారు. పంటకోత ప్రయోగాలు చేయడం వల్ల దిగుబడులను అంచనా వేసి ధాన్యం ఎగుమతి, దిగుమతి, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయా లేక తగ్గాయా తెలుసుకోవచ్చన్నారు. ప్రతి రైతు పంటకోత ప్రయోగాల నిర్వహణ సమయంలో పాల్గొని దిగుబడులను అంచనా వేసే విధానాన్ని తెలుసుకోవాలని ఆయన కోరారు.

వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎఒ నాగలక్ష్మి

తెగుళ్ల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండలంలోని చిన్న రంగాపురం గ్రామంలో ఆహారం, పోషకాల భద్రత, వంట నూనెలు, నూనె గింజలు జాతీయ యంత్రం 2024-25 సాంబశివారెడ్డి వేరుశనగ రెండేకరాల్లో నిర్వహించారు. ఎఒ జి.నాగలక్ష్మి మంగళవారం రైతులతోపాటు వేరుశనగ పంటలో చీడపీడలు గమనించారు. రసం పీల్చే పురుగుల నివారణకు పసుపుపచ్చ పల్లాలు ఎకరానికి 25 చొప్పున పెట్టుకోవాలని సూచించారు. వేరుకుళ్లు నివారణకు విత్తనం నాటు కుంటున్నప్పుడే విత్తనశుద్ధి మాన్కోజిబ్ మూడు గ్రాములు లేదా టేబు కొనసాల్ ఒక గ్రాము లీటర్ నీటికి కలిపి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సురేష్, రైతులు పాల్గొన్నారు.

విలేకరి ప్రసాద్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు ఆంధ్రజ్యోతి విలేకరి తల్లం వెంకట నాగ ప్రసాద్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక పాత్రికేయులు కోరారు. ప్రసాద్ అనారోగ్యం కారణంగా మృతి చెందడం అత్యంత బాధాకరం, దురదృష్టకరమని పలువురు సంతాపం వ్యక్తపరిచారు. సుదీర్ఘకాలం పాటు పాత్రికేయ వృత్తిలో కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడుతుండేవారని కొనియాడారు. ప్రసాద్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

జగన్ స్వార్థ రాజకీయాలతోనే లబ్ధిదారులకు ఇబ్బందులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జగన్ స్వార్థ రాజకీయాల కోసమే టిట్కో లబ్ధిదారులకు గృహాలు నిర్మించకుండా చేశారని, టిడిపి ప్రభుత్వంలో పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి సహకారంతో తగు న్యాయం చేస్తామని టిడిపి మాజీ పట్టణాధ్యక్షుడు మద్దూరు వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన టిడిపి నాయకులతో కలిసి కదిరి రోడ్డులో ఉన్న టిట్కో స్థలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014-19 టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించారని తెలిపారు. 2018లో పులివెందులలో సుమారు 1,845 మంది లబ్ధిదారులకు టిట్కో ఇళ్లను నిర్మించేందుకు టెండర్లు పిలిచారని, అందుకు సంబంధించి అప్పట్లో సింప్లెక్స్, నాగార్జున కంపెనీలు అనుమతులు పొందాయన్నారు. టిట్కో ఇళ్ల నిర్మాణాల కోసం లబ్ధిదారులు అప్పట్లోనే రూ.36 లక్షలు ఖర్చు చేశారన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన వెంటనే టిట్కో ఇళ్లను రద్దుచేసి లబ్ధిదారులను నిలువునా ముంచారన్నారు. దాదాపు రూ.50 కోట్ల నగదు జగనన్న లేఅవుట్ పేరుతో దారి మళ్లిందని విమర్శించారు. పులివెందుల ఎమ్మెల్యేగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం వస్తున్నారని, ఇప్పుడైనా టిట్కో స్థలాలను పరిశీలించి వాటిని నిర్మించాలని ప్రభుత్వానికి లేక కూడా రాయాలని హితవు పలికారు, నాలుగున్నర ఏళ్లలో టిట్కో ఇళ్లు నిర్మించి తీరుతామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సారెడ్డి గంగాధర్‌రెడ్డి, లింగాల మండలం అమర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి

నీటి శుద్ధి పనుల్లో అక్రమాలు

వినియోగంలోలేని వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ - కొన్నేళ్లుగా కొనుగోలు చేయని ఆలం, క్లోరిన్ - రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నట్లు నమోదు

దిష్టి బొమ్మలా ఉన్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

ప్రజాశక్తి - లింగాల

సిపిడబ్ల్యూఎస్ (సమగ్ర రక్షిత మంచినీటి పథకం)లో అవినీతి చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారనే ఆరోపణలున్నాయి. అప్పటి ప్రభుత్వ పాలనలో ఏ విధమైన అక్రమాలు చోటు చేసుకున్నాయో.. ప్రస్తుత కూడా అదే తంతు నడుస్తోందనే విమర్శలున్నాయి. పెంచికల బసిరెడ్డి రిజర్వాయరు నుంచి తోడిన నీటిని శుద్ధి చేసి సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ తలుపులకు మూత పడ్డాయి. సురక్షితమైన నీరుగా మార్చకపోయినా ప్రతి ఏటా రూ.లక్షల ఖర్చు చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేసి ఆ నిధులు దోచుకుంటున్నారు. మరోవైపు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వినియోగంలో లేకపోయినా గత ప్రభుత్వంలో రూ.లక్షల వ్యయం చేసి ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రాలు నిరుపయోగంగా మూలన చేరాయి. ఇది లింగాల మండలంలోని పార్నపల్లె వద్ద ఉన్న పెంచికల బసిరెడ్డి రిజర్వాయర్ వద్ద ఉన్న సిపిడబ్ల్యూఎస్‌లో తలెత్తుతున్న వ్యవహారం. కిందిస్థాయి అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఖర్చు చేయకపోయినా చేసినట్లుగా తప్పుడు లెక్కలు చూపించి ప్రజాధనాన్ని మింగేశారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు నేడు కలుషిత నీటితోనే దప్పిక తీర్చుకోనే పరిస్థితి ఏర్పడింది. దీనంతటికీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడమే ప్రధాన కారణం.

పులివెందుల నియోజకవర్గంలోని 112 గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన నీరు సరఫరా చేసేందుకు ఏర్పాటైన సమగ్ర రక్షిత మంచినీటి పథకం నేడు శాపంగా మారింది. ఈ నేపథ్యంలో పార్నపల్లెలోని పెంచికల బసిరెడ్డి రిజర్వాయర్ నుంచి సరఫరా చేసుకున్న నీటిని మొదటగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లుకు, అక్కడి నుంచి ఏరిమోనస్ డస్ట్ నీటిని శుద్ధి చేయడం కోసం ఆలం కలుపుతారు. నీటిలోని మట్టి అంతా కిందికి చేరుకుని ఫిల్టర్ బెడ్స్ పంపుతారు. శుద్ధి చేసిన నీరు సంప్ స్టోరేజికి చేరుకుంటుంది. క్లోరిన్ కలిపి గ్రౌండ్ లెవెల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ పద్ధతి కొనసాగడం లేదు. సిపిడబ్ల్యూఎస్ నిర్వహణకు కేటాయించిన రూ.కోటి 45 లక్షల్లో 25శాతం ఆలం, క్లోరిన్ కొనుగోలు చేయాలి. అలా చేయకుండానే అధికారులు రికార్డుల్లో చేసినట్లు నమోదు చేసి బిల్లులు పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. కొన్నేళ్ల నుంచి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వినియోగంలో ఉన్న దాఖలాలు కనిపించడం లేదు. దీని నిర్వహణ పేరుతో కొన్నేళ్లుగా నిధులను కాంట్రాక్టర్లు మింగేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

తుప్పుపడుతున్న నీటిశుద్ధి యంత్రాలు..

వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్వహణను కొన్నేళ్ల నుంచి గాలికి వదిలేశారు. నీటిశుద్ధి యంత్రాలు తుప్పు పడుతున్నాయి. ఈ క్రమంలో ఆ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద కాలం చెల్లిన ఆలం, తుప్పు పట్టిన యంత్రాలు దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వంలో పాడా కింద రూ.10 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన శుద్ధిచేసిన నీటి నాణ్యత యంత్రం మరమ్మతులకు గురైంది. నీటి మోటర్లు కూడా క్రమంగా తుప్పు పడుతున్నాయి. ఫలితంగా ప్రస్తుతం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ దిష్టి బొమ్మలా తయారైంది.

ఉపయోగించక మూలన చేరిన కాలం చెల్లిన ఆలం

నీటి శుద్ధి చేయక నిరుపయోగంగా ఉన్న నీటి యంత్రాలు

నీటిని కొని దప్పిక తీర్చుకుంటున్నారు..

మూడు దశాబ్దాల క్రితం గ్రామీణ ప్రజలకు సురక్షితమైన నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన సిపిడబ్ల్యూఎస్ లక్ష్యం నీరుగారి పోయింది. ఇక్కడ నీటిని శుద్ధి చేసేందుకు కేటాయింపు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్వహణ చేయకపోవడం, పైపుల లీకేజీలతో నేడు 112 గ్రామాలకుగాను 34 గ్రామాలకు కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఇదే అదనుగా భావించిన నీటి వ్యాపారులు గ్రామీణ ప్రాంతాల్లో ప్రయివేట్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. కలుషిత నీటితో గొంతు తడుపుకోలేక ప్రజలు డబ్బు పెట్టి తెచ్చుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో సిపిడబ్ల్యూఎస్ నిర్వహణ అధ్వానంగా మారింది. దీని నిర్వహణ కోసం ప్రతి ఏటా ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల బుడిదలో పోసిన పన్నీరులా మారిపోతున్నాయి.

నీటిని శుద్ధి చేస్తున్నాం..

ప్రజలకు సురక్షితమైన నీటిని అందిస్తున్నాం. నీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నాం. నీటి శుద్ధిలో ఏమైనా లోపాలు ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - ఇక్బాల్, డిఇ, ఆర్‌డబ్ల్యూఎస్

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ఈరో కిడ్స్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కడప సిటీ

కడప నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని ఈరో కిడ్స్ పాఠశాలలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపల్ అనూష ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శాంటా ప్లాజాతో కలిసి క్రిస్మస్ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ ఏసుక్రీస్తు తన బోధనలో మానవాళికి ప్రేమను పంచడం నేర్పించాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. శాంటా క్లాస్ వేష ధారణలో విద్యార్థులు పిల్లలందరికీ కూడా స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాజీపేట : బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. ఆయా చర్చిలను విద్యుత్ దీపాలతో

బీరం పాఠశాలలో విద్యార్థులు, యాజమాన్యం

అలంకరించారు. మంగళవారం రాత్రి చర్చిల్లో కేక్ కట్ చేశారు. క్రైస్తవ గీతాలాపనతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ శాంతియుత మార్గంలో పయనించడంతోపాటు ప్రేమ, దయ, జాలి, కరుణ ఇతరుల పట్ల చూపాలని ఆకాంక్షించారు. **బీరం పాఠశాలలో ముందస్తు వేడుకలు..** మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో మంగళవానం ముందస్తు క్రిస్మస్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు జననం అందరికీ ఆదర్శనీయమన్నారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. చిన్నారుల వేషాధారణ అందరిని ఆకట్టుకుంది. చిన్నారుల శాంత క్లాస్ డ్రెస్సులు, ఏంజెల్ డ్రెస్, క్రిస్మస్ గీతాలు, నృత్యాలతో వేడుక ఘనంగా జరిగింది. కార్యక్రమంలో బీరం విద్యా సంస్థల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో..

వేంపల్లె : వేంపల్లెలోని టిడిపి కార్యాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఆ పార్టీ నేతలు నిర్వహించారు. టిడిపి ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేక్‌ను టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, తెలంగాణ వలి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, జగన్నాథరెడ్డి, మహమ్మద్ రజనీకాంత్ రెడ్డి, శేషారెడ్డి, వేమా కుమార్, డక్కా రమేష్, యుగంధర్ పాల్గొన్నారు.

కడప అర్బన్ : నగరంలోని అక్కాయపల్లెలో ఉన్న సాయిబాబా విద్యాసంస్థల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి కేక్ కట్ చేసి చిన్నారులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు కరుణామయుడుగా, దయామయుడుగా అందరి ఆరాధనలు అందుకుంటున్నారని పేర్కొన్నారు. 46వ డివిజన్ కార్పొరేటర్ ఎం.వి. శ్రీదేవి మాట్లాడుతూ పండుగల ఔన్నత్యాన్ని విద్యార్థులకు తెలియజేయడం ఎంతో అవసరమన్నారు. నవీన యుగంలో విద్యార్థులకు ఉమ్మడి కుటుంబాల ఆవశ్యకతను తెలుసుకోవాలని చెప్పారు. పెద్దలను, బంధువులను గౌరవించడం నేర్చుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు శాంతా క్లాస్ వేషాలు ధరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎం.వి. సాయి సుధీర్ కుమార్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సుబ్బారాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో సాయిబాబా స్కూల్ విద్యార్థుల,యాజమాన్యం

శాంతికి ప్రతిరూపం క్రిస్మస్ : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రేమ, కరుణ, శాంతికి ప్రతిరూపం క్రిస్మస్ అని, ప్రతి ఒక్కరూ క్రీస్తు సూక్తిని పాటించాలని రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అన్నారు. సందర్భంగా మంత్రి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజలకు, క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నాయీ బ్రాహ్మణులకు సబ్సిడీ రుణాలు

- నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వంలో బ్యాంకుల నుంచి ఇస్తున్న సబ్సిడీ రుణాలను నాయీ బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్ కోరారు. మంగళవారం వేంపల్లెలో నాయీ బ్రాహ్మణులతో రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులను ఆర్థికంగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కడప పార్లమెంటు పరిధిలో 5వేలు మంది నాయీ బ్రాహ్మణులకు రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జనవరి నుంచి కూటమి ప్రభుత్వం రుణాలు ఇస్తుందని తెలిపారు. రుణాల మంజూరుకు తాను కృషి చేస్తానని తెలిపారు. రాయితీ రుణాలకు క్రాప్ ఇన్సూరెన్స్‌కు ఏలాంటి సంబంధం లేదన్నారు. నాయీ బ్రాహ్మణుల షాపులకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తుందని తెలిపారు. గ్రూపుగా వెళ్లి షాపులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని అధికారులను కోరాలని పేర్కొన్నారు. సొంతగా షాపులు ఏ ఒక్కరూ పెట్టుకోలేదని, అందరూ బాడుగలకు గదులను తీసుకొని షాపులను పెట్టుకొన్నట్లు డైరెక్టర్ దృష్టికి తెచ్చారు. ఉచిత విద్యుత్‌పై విద్యుత్ ఎస్ఇతో చర్చించనున్నట్లు డైరెక్టర్ హామీ ఇచ్చారు. బ్యాంకులో తీసుకొనే సబ్సిడీ రుణానికి ఎలాంటి ష్యూరిటీ లేదన్నారు. టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి మాట్లాడుతూ అనుకూలంగా ఉన్న వ్యక్తికి పదవి రావడం అదృష్టమన్నారు. అనంతరం రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్‌ను నాయీ బ్రాహ్మణులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నేత మహమ్మద్ ఇనా యతుల్లా, రత్నం, బిసి నాయీ బ్రాహ్మణ సాధి కారత సభ్యుడు గండికోట శివ, బాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

7న జిల్లా స్థాయిలో చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని జనవరి 7న కడప జిల్లా స్థాయిలో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపల్ భూమిరెడ్డి వెంకట సుబ్బయ్య, అధ్యాపకులతో కలిసి ఆయన పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 15 ఏళ్లలోపు విద్యార్థులకు జూనియర్స్ విభాగం కింద స్వామి వివేకానందుడి ముఖ చిత్రం, 30 ఏళ్లలోపు యువతకు సీనియర్స్ విభాగం కింద 'ప్రకృతిని కాపాడుకోకపోతే భవిష్యత్తులో జరగబోయే పరిణామాలు' అనే అంశాల మీద చిత్రాలు వేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ బహుమతి రూ.5,116, ద్వితీయ బహుమతి 3,116, తృతీయ బహుమతి రూ.2116తోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, వివేకానందుడి సాహిత్యం అందజేస్తామన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్, వివేకానందుడి సాహిత్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు తమ పేర్లను నమోదు 88972 92237 ఫోన్ నెంబర్‌ను సంప్రదిం చాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కిషోర్, నర్సింహులు, చంద్రఓబుల్‌రెడ్డి, జ్యోతి, సంస్థ ప్రతినిధులు టి.వెంకట సురేష్, రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

అమిత్‌షా తక్షణం రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

కేంద్రమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతం కుమార్ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో పార్లమెంటులో హోం శాఖ మంత్రి అమిత్‌షా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షులు మాయావతి ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర బహుజన్ సమాజ్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అబ్బవరం యుగంధర్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతం కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను మతతత్వ పార్టీ నాయకుడు, హోంశాఖ మంత్రి అమిత్‌షా, సాక్షాత్తు పార్లమెంటులో అగౌరవంగా మాట్లాడడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యుగంధర్, జిల్లా నేతలు ఆంజనేయులు, బాలాజీ, శ్రీనాథ్, గంగాధర్ మహేష్ మరియు, తంబళ్లపల్లె ఇన్‌ఛార్జి మల్లికార్జున పాల్గొన్నారు.

జోగిరెడ్డిని సన్మానిస్తున్న అనంతపురం జిల్లా రైతులు

రైతుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తా

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రైతుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తానని టిబిసి హెచ్‌ఎల్‌సి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కసనూరులో మంగళవారం అనంతపురం జిల్లాకు చెందిన పలువురు రైతులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో తనకు పదవి రావడానికి కృషి చేసిన వారి ఆశయాలకు అనుగుణంగా వ్యవహరిస్తానని తెలిపారు. కాలువలను ఆధునీకరణ చేసి చివరి ఆయకట్టు వరకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకుం టామన్నారు. కార్యక్రమంలో ఎల్లనూరు మండలం పాతపల్లి సర్పంచ్ నవీన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ప్రభాకర్‌రెడ్డి, ఎరువుల అంగడి యాజమాని చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

27న సింహాద్రిపురం మండల సమావేశం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో ఈనెల 27న సింహాద్రిపురం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. అధికారులు ఆయా శాఖలకు సంబంధించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆయన సూచించారు.

బిసిల సాధికారిత కాంగ్రెస్‌తోనే సాధ్యం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి, వైసిపి, బిజెపి, జనసేన పార్టీలు పుట్టకముందే బిసిల అభ్యున్నతి, సాధికారిత గురించి కాంగ్రెస్ పార్టీ ఆలోచించిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిసిలకు విద్యా, ఉద్యోగాల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం జిఒ 1793 జారీ చేసిందన్నారు. ఈ రిజర్వేషన్లుతో లక్షలాది మంది బిసిలు ఉన్నత చదువులతో ఉన్నత ఉద్యోగాలు పొందారన్నారు. ఉన్నత జీవన ప్రమాణాలతో జీవిస్తున్నారని చెప్పారు. 1993లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. పర్యవసానంగా లక్షలాది మంది బిసిలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారని వివరించారు. 1968లోనే కాంగ్రెస్ ప్రభుత్వం బిసి కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. 1974లో బిసి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని తెలిపారు. 2009లో ఉప్పర, వాల్మీకి, పూసలు, భట్రాజుల కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందన్నారు. చెప్పారు. ఇప్పటికైనా బిసిల పట్ల టిడిపి కూటమికి అంతోఇంతో ప్రేమ ఉంటే బిసి కార్పొరేషన్లకు నిధులు, విధులు, అధికారాలు ఇవ్వాలని తులసి రెడ్డి హితవు పలికారు.

ఈశ్వరిదేవి మఠానికి రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలో వెలసిన శ్రీ జగన్మాత ఈశ్వరి మహాదేవి మఠానికి డి.అగ్రహారం గ్రామానికి చెందిన కానాల మల్లికార్జున్‌రెడ్డి ధర్మపత్ని మాధవి మంగళవారం అమ్మవారి సన్నిధిలో రూ.10లక్షలు విరాళం చెక్కును జగన్మాత శ్రీఈశ్వరి దేవి మఠాధిపతి వీర శివకుమార్ స్వాములుకు అందజేశారు. ఈ విరాళాన్ని ఈశ్వరి మహాదేవి మఠం అభివృద్ధికి వినియోగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈశ్వరిదేవి మఠం కార్య నిర్వహణ అధికారి జగన్మోహన్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ మండలశాఖ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎల్లటూరు సాంబశివారెడ్డి, పూజ శివయ్య యాదవ్, సుధాకర్, మండల తెలుగు యువత అధ్యక్షులు సన్నపురి శ్రీను పాల్గొన్నారు.

సన్మానం పొందుతున్న దాతలు